క్లుప్తంగా

లేబర్ అడ్డాలో వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న కోడం రమణ

సిరిసిల్లటౌన్: జిల్లాకేంద్రంలోని లేబర్ అడ్డాపై పనిచేస్తున్న స్థానిక భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించి, మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ కోరారు. శనివారం గాంధీనగర్‌లోని లేబర్‌అడ్డాలో భవన కార్మికులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి పనిచేస్తున్న కార్మికులతో అడ్డపై పనిచేస్తున్న స్థానిక భవన నిర్మాణ కార్మికులకు సరైన ఉపాధి దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వలస కార్మికుల చట్టాన్ని అమలుచేయాలని, స్థానిక కార్మికులకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20 జరిగే కలెక్టరేట్ ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనంతపల్లి మత్స్యకారులను ఆదుకోవాలి



బోయినపల్లి: మండలంలోని అనంతపల్లి గ్రామ బందంకుంటలో చేపలు చనిపోయి ఆర్థికంగా నష్టపోయిన మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలని మత్యశాఖ జిల్లా చైర్మన్ చొప్పరి రామచంద్రం, ముదిరాజ్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాములు పేర్కొన్నారు. శనివారం చేపలు మృతిచెందిన బందంకుంట పరిసరాలను వారు పరిశీలించారు. కలెక్టర్, డీఎఫ్‌వో ప్రభుత్వం ద్వారా మత్స్యకారులను ఆదుకోవాలని కోరారు. మండల అధ్యక్షుడు పిట్టల రమేశ్, మాజీ ఉపసర్పంచ్ పర్శమల్లేశం, గ్రామ సొసైటీ అధ్యక్షుడు యామ జనార్దన్, నారాయణ తదితరులు ఉన్నారు. .

నిరుద్యోగ గొంతుకనై పనిచేస్తా



మాట్లాడుతున్న యాదగిరి శేఖర్‌రావు


గంభీరావుపేట/ఎల్లారెడ్డిపేట: పట్టభద్రుల హక్కుల గురించి పోరాడుతూ మండలిలో నిరుద్యోగ గొంతుకగా పనిచేస్తానని ప్రైవేట్ పాఠశాలల సంఘం రాష్ట్ర నాయకుడు యాదగిరి శేఖర్‌రావు అన్నారు. ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట మండల కేంద్రాల్లో శనివారం ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయుల సమావేశం ట్రస్మా ఆధ్వర్యంలో జరిగింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతునివ్వాలని ఆయన కోరారు. ట్రస్మా జిల్లా అధ్యక్షులు నాగుల శ్రీనివాస్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు ఎండీ లతీఫ్, మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, పెద్దిగారి శ్రీనివాస్, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు ప్రకాశ్, బాలయ్య, నరేశ్, సుధ, రాజు తదితరులు పాల్గొన్నారు.

కోరెం స్కూల్‌లో 'పోలీస్ అక్క'



బోయినపల్లి: ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు మండలంలోని కోరెం ప్రభుత్వ పాఠశాలలో ఎస్సై దూలం పృథ్వీధర్ గౌడ్ ఆధ్వర్యంలో మహిళా సిబ్బంది పింకిల్ యాదవ్ ద్వారా శనివారం మండల పోలీస్ అక్క కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు సేఫ్‌టచ్ అండ్ అన్ సేఫ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఎవరైనా ఆకతాయిలు వేధిస్తే షీటీం నెంబర్ 8712656425 కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు ఉన్నారు.

వేములవాడ సమాచారం



వేములవాడ రాజన్న సన్నిధిలో శనివారం భక్తుల రద్దీ కొనసాగింది. సాయంత్రం 4 గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	0	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	0	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	0	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	0	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	03	1,008
నందీశ్వర నాన్‌ఏసీ	02	560
నందీశ్వర సూట్స్	0	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	08	448
పార్వతీపురం స్పెషల్	06	672
పార్వతీపురం సాధారణ	11	336

- వేములవాడ

ప్రమాదాలపై పట్టింపేది ?



కిష్టంపేట శివారులో ప్రమాదకరంగా వ్యవసాయ బావి



మర్రిగడ్డ గ్రామ శివారులో..

- రోడ్ల పక్కన ప్రమాదకరంగా బావులు
- రక్షణ గోడలు లేకపోవడంతో వాహనదారుల ఇబ్బంది
- పట్టించుకోని అధికారులు

చందుర్తి : ఆర్‌అండ్‌బీ రోడ్ల పక్కన వ్యవసాయ బావులు ప్రమాదకరంగా మారాయి. ఏటా వర్షాకాలంలో కొద్దికొద్దిగా కూలుతుండగా తారురోడ్డు తాకేలా వస్తున్న వాటి వద్ద రక్షణ గోడలను అధికారులు ఏర్పాటు చేయడం లేదు. చెట్ల పొదల మధ్య నిండిపోయి బావులు కనబడకుండా ఉన్నాయి. వాహనదారులు అదుపుతప్పితే బావుల్లో పడి ప్రమాదం జరిగే అవకాశం ఉంది.

గతంలో ప్రమాదాలు..

మండలకేంద్ర శివారులోని అంబేడ్కర్ విగ్రహ మూలమలుపు వద్ద ఉన్న వ్యవసాయ బావిలో కారు పడటంతో 2016 నవంబర్ 2న ఇదే మండలంలోని కట్టలింగంపేట గ్రామానికి చెందిన ఆవారి రాజేశం మృతిచెందాడు. దీనిపై వెంటనే స్పందించి అధికారులు బావిని పూడ్చివేశారు.

అలాగే మర్రిగడ్డ శివారులోని రోడ్డు పక్కనే ఉన్న 2018 మార్చి 21న వ్యవసాయ బావిలో ద్విచక్ర వాహనం పడడంతో ప్రాణనష్టం ఏమి జరగలేదు, కానీ ప్రమాదకరంగా ఉన్న బావిని పూడ్చివేశారు. వేములవాడ– కోరుట్ల ప్రధాన రహదారి అయిన చందుర్తి –మల్యాల గ్రామాల మధ్య బావి పూడ్చివేయించారు. వినియోగంలో ఉండి రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న బావులను గుర్తించి వాటికి రక్షణగా కంచెలు ఏర్పాటు చేయించారు. ఏళ్లు గడవడంతో వర్షాకాలంలో ఏటా ఇంత కూలగా వేసిన కంచెలు కూలిపోయాయి. వాటిని తిరిగి ఏర్పాటు చేయించడంలో ఆర్‌అండ్‌బీ అధికారులు విఫలమవుతున్నారు.

ప్రమాదకర ప్రదేశాలివే...

- మండలంలోని కిష్టంపేట నుంచి రామరావుపల్లె రోడ్డుకు వెళ్లే దారిలో పురాతనమైన బావి రోడ్డు అంచున కనిపించకుండా ఉంది.
- కిష్టంపేట అమ్లేట్ నక్కపల్లె నుంచి రామరావుపల్లెకు వెళ్లేదారిలో ప్రమాదకరంగా బావి ఉంది.
- మర్రిగడ్డ– జోగాపూర్ గ్రామాల మధ్య ఇదే పరిస్థితిలో వ్యవసాయ బావి ఉంది.

రోడ్డు పక్కన ప్రమాదభరితంగా ఉన్న వ్యవసాయ బావులను గుర్తించి, వాటికి ఇప్పటికైనా తిరిగి రక్షణ గోడలు నిర్మించాలని, మరీ ప్రమాదభరితంగా ఉన్న చోట్ల సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

సూచికలు ఏర్పాటు చేయాలి



రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న బావులను గుర్తించి అధికారులు ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయించాలి. మర్రిగడ్డ నుంచి సనుగుల వరకు రోడ్డుపక్కన బావుల వద్ద తిరిగి రోణ గోడలు ఏర్పాటు చేయించేందుకు చర్యలు చేపట్టాలి. లేకపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

– బొల్లిపల్లి చిరంజీవి గౌడ్, సనుగుల

ప్రతిపాదనలు పంపాం

మండలంలోని మల్యాల శివారులో, మర్రిగడ్డ – సనుగుల వరకు నాలుగు బావులను గుర్తించాం. వినియోగంలో లేని బావులు పూడ్చివేయించేందుకు రైతులతో మాట్లాడాలని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లాం. వినియోగంలో ఉన్న బావుల వద్ద రక్షణ గోడలు ఏర్పాటు చేయించేందుకు అంచనాలు వేసి ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు అందజేశాం.

– నవ్యశ్రీ, ఆర్‌అండ్‌బీ, ఏఈ, చందుర్తి



ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్ శివారులోని సింగసముద్రం నీటి కాలువలు గడ్డి, పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. సింగసముద్రం ఆయకట్టు పరిధిలోని గ్రామాలకు నీరందించే కాలువల పరిస్థితి ఇలా ఉంటే భూములు తడిసేదేలా అని రైతులు వాపోతున్నారు. సాగునీటిని విడుదల చేయకముందే కొన్ని కాలువలను ఉపాధిహామీలో భాగంగా శుభ్రం చేసినప్పటికీ, మరి కొన్నింటిని నీటిపారుదల శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గడ్డి, ముళ్లపొదలు, పిచ్చిమొక్కలను తొలగించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : సత్యనారాయణ, నీటి పారుదలశాఖ అధికారి: సెల్ నంబర్: 9550917918

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

పల్లెల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



ఎల్లారెడ్డిపేట: పల్లెల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, గ్రామాల్లో మౌలికవసతుల కల్పనకు పెద్దఎత్తున నిధులు మంజూరు చేస్తున్నట్లు ఏఎంసీ చైర్మన్ సాబేరా బేగం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. రాజన్నపేటలో రూ.20 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. మండలంలోని అన్నిగ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. నిధులు మంజూరుకు కృషిచేసిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

మార్కెట్ యార్డుకు స్థలపరిశీలన

మండలకేంద్రంలో ఏర్పాటు చేయనున్న మార్కెట్ యార్డు నిర్మాణానికి కాంగ్రెస్ నాయకులు స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో పీసీసీ నాయకులు సంగీతం శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు ముక్కశంకర్, మర్రి శ్రీనివాస్‌రెడ్డి, బండారి బాల్‌రెడ్డి, రాంరెడ్డి, గౌస్, రవీందర్‌రెడ్డి, మెండే శ్రీనివాస్, గుర్రపు రాములు, చెన్ని బాబు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని పెద్ద లింగాపూర్ గ్రామంలో రూ.5 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను శనివారం కాంగ్రెస్ నాయకుడు కరుణాకర్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులున్నారు.

అదుపు తప్పితే అంతే..



వేములవాడరూరల్: వేములవాడ మూలవాగు నుంచి తిప్పాపూర్‌కు వెళ్లే ఈ రహదారి గత వర్షాకాలంలో పూర్తిగా కొట్టుకుపోయింది. అయినప్పటికీ కొంతమంది వాహనదారులు ఈ రహదారి గుండా అతికష్టంపై అవతలి వైపు ప్రయాణం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

● నిరుపేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్



ఎల్లారెడ్డిపేట: సీఎం ఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరమని కాంగ్రెస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు అన్నవేణి రవి, మాజీ సర్పంచ్ శ్రీని వాస్ అన్నారు. దుమాలలో పలువురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఇక్కడ నాయకులు ధర్మారం రవి, భాను, భూమయ్య, తదితరులున్నారు.

● దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్ల కల్చరల్: బ్యాంకింగ్ రైల్వే స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ ఉద్యోగాలకు పోటీపడే అభ్యర్థులకు ఫౌండేషన్ కోర్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జిల్లా వెంకటస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20 నుంచి వచ్చేనెల 9 వరకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. www.tgbcstudycircle.cgg.gov.in లో అభ్యర్థులు తమ వివరాలు పొందుపర్చాలన్నారు. ఇంటర్, డిగ్రీ పరీక్షల్లో మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. ఇస్తామన్నారు. పూర్తి వివరాలకు 93818 88746 సెల్‌నెంబర్లో సంప్రదించాలని కోరారు.

బోయినపల్లి: మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో 2025–2026 విద్యాసంవత్సరానికి ఆరో తరగతిలో వందసీట్ల భర్తీకి, 7వ తరగతి నుంచి 10వదో తరగతి వరకు ఖాళీసీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ ఎరువ రఘునాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 28 వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఏప్రిల్ 13న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు 6వ తరగతి ప్రవేశపరీక్ష ఉంటుందని, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 7 నుంచి పదో తరగతి ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తు రుసుం జనరల్ కేటగిరి రూ. 200, ఎస్సీ, ఎస్టీ, బీసీ దివ్యాంగులకు రూ. 125 ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

● యువకుడిపై దాడిచేసిన నలుగురిపై కేసు

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి గ్రామానికి చెందిన లింగం సాయిచందు అనే యువకుడిపై ఈనెల 14న నలుగురు యువకులు దాడిచేశారు. దీంతో సాయిచందు ఫిర్యాదు మేరకు శనివారం బండి సాయికృష్ణ గౌడ్, గాజుల ప్రవీణ్, గంగరమణ రెడ్డి, అంకారపు మధుపై ఎస్సీ, ఎస్టీ కేసునమోదు చేసినట్లు ఎస్సై బి.రామ్మోహన్ తెలిపారు.

● ప్రవక్త మార్గంలో నడవాలి

సిరిసిల్లటౌన్: ఒకరికొకరు సహాయ సహకారాలు అందిస్తూ ప్రతిఒక్కరూ మహ్మద్ ప్రవక్త చూపిన మార్గంలో నడవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. శనివారం పట్టణంలోని 39వ వార్డులో దారుల్ ఖైర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆకుల కృష్ణ, దారుల్ ఖైర్ వెల్ఫేర్ సొసైటీ సంస్థ ప్రతినిధులు, ఎండీ ఇన్ కేసర్ బాబా, రఫీ, అన్సర్ అలీ, సలీం పాష, తదితరులు పాల్గొన్నారు.

● బస్తాకు రూపాయి పెంపు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని హమాలీలకు బస్తాకు రూపాయి కూలి పెంచుతూ శనివారం సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి నిర్ణయించారు. ప్రాథమిక సహకార సంఘంలో హమాలీలతో ఆయన సమావేశమయ్యారు. గతంలో బస్తాకు రూ.5 ఉండగా, దాన్ని రూ.6కు పెంచామని, మరోసారి కార్మికుల అభ్యర్థన మేరకు రూపాయి పెంచడంతో బస్తాకు రూ.7చొప్పున చెల్లించనున్నట్లు కృష్ణారెడ్డి తెలిపారు. దీనిపై హమాలీ కార్మికులు హర్షం వ్యక్తంచేశారు. సమావేశంలో హమాలీలు కోనేటి ఎల్లయ్య, కోనేటి మల్లేశం, ఊసి ఆంజనేయులు, శేఖర్, భీమయ్య, కోనేటి కనుకయ్య తదితరులున్నారు.

● గ్రామస్తుల సమావేశం

ఇల్లంతకుంట : మండలకేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయంలో విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంపై శనివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులు గురుస్వాములు సమావేశమయ్యారు. ఫిబ్రవరి 7న నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయంలో విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించేందుకు నిర్ణయించారు. సమావేశంలో గురు స్వాములు, అయ్యప్ప స్వాములు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



సిరిసిల్లటౌన్: సిరిసిల్లలోని చిన్న బోనాలలో కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రి, ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహించారు. 150 మందికి వివిధ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ...స్థానిక ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంతో వైద్య శిబిరం నిర్వహించామన్నారు. కౌన్సిలర్ నాగరాజు, లచ్చయ్య, కొండయ్య, బాబు, సంఘం సభ్యులు, ఆస్పత్రి మార్కెటింగ్ మేనేజర్ కర్ణాకర్, శ్రీకాంత్, లక్ష్మీ రాజం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

వీర్నపల్లి: మండలకేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థులకు మండల వైద్యాధికారి డాక్టర్ సారియా అంజుమ్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. నలుగురు విద్యార్థులను ఎల్లారెడ్డిపేటలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పంపించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అశోక్, పీఈటీ ప్రతాప్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ బాబు, ఏఎన్‌ఎంలు సుజాత, మంజుల, ఆశాకార్యకర్తలు సువర్ణ, మంజుల, చంద్రకళ ఉన్నారు.

చికిత్స పొందుతూ మృతి



రాజేందర్ (ఫైల్)

వేములవాడఅర్బన్: రాజన్నను దర్శించుకునేందుకు ఈనెల 15న వచ్చి యువకుల దాడిలో గాయపడిన మంచిర్యాలకు చెందిన రాజేందర్ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా జెండా వెంకటాపురంకు చెందిన ఏసుకూరి రాజేందర్ (27) ఈనెల 15న రాజన్న దర్శించుకునేందుకు మరో స్నేహితుడు శంకర్‌తో కలిసి బైక్‌పై తెల్లవారుజాము వచ్చారు. దారితప్పిన సదరు వ్యక్తులు భగవంతరావునగర్‌లోని యువకులకు కనిపించారు. దాంతో వారు అడిగిన ప్రశ్నలకు వీరు కొంత తడబడటంతో దొంగలుగా భావించి చితకబాదారు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడిన రాజేందర్, శంకర్‌ను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. రాజేందర్ నాలుగు రోజులుగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. రాజేందర్ మృతికేసులో నలుగురు యువకులపై కేసు నమోదు చేసి వారికోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

మద్యంతాగి వాహనాలు నడిపిన పలువురికి జరిమానా

రుద్రంగి: మండలపరిధిలో మద్యంతాగి వాహనాలు నడిపిన పలువురికి వేములవాడ జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జ్యోతిర్మయి జరిమానాలు విధించినట్లు ఎస్సై సిరిసిల్ల అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. 13 మందికి రూ.15 వందలు, ముగ్గురికి రూ.2వేల చొప్పున మొత్తం రూ. 25,500 జరిమాన విధించినట్లు చెప్పారు. మద్యంతాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



తంగళ్లపల్లి: మండలంలోని అంకుషాపూర్‌లో శనివారం జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని ప్రారంభించారు. ఈ సందర్భంగా టోని మట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసంతోపాటు స్నేహభావం పెంపొందుతుందన్నారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ ఇట్టిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మునిగెల రాజు, మానవ హక్కుల యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గుగ్గిళ్ల భరత్ గౌడ్, నాయకులు ఆత్మకూరి తిరుపతి, పొన్నాల లక్ష్మణ్ గౌడ్, మిరాల శ్రీనివాస్ యాదవ్, శ్రీకాంత్, పవన్, శ్రీనివాస్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట: వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని జిల్లా వాహన తనిఖీ అధికారి వంశీధర్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని దుమాల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అధికారులు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధిక వేగం వద్దని బంధువులు, తల్లిదండ్రులు, స్నేహితులకు విద్యార్థులు తెలియజేయాలన్నారు. మద్యంతాగి, ఫోన్ మాట్లాడుకుంటూ వాహనాలు నడపవద్దన్నారు. అనంతరం రోడ్డు భద్రత సామాజిక బాధ్యత అంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సహాయక వాహన అధికారి పృథ్వీరాజ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కెట్‌ను వినియోగంలోకి తెస్తాం

సాక్షి స్పందన

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని నిరుపయోగంగా ఉన్న మటన్ మార్కెట్‌ను వినియోగంలోకి తీసుకువస్తామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. 'సాక్షి' దినపత్రికలో 'నిధుల లేమి.. నిలిచిన నిర్మాణం' అనే శీర్షికతో వచ్చిన కథనానికి కాంగ్రెస్ నాయకులు స్పందించారు. నిరుపయోగంగా ఉన్న మార్కెట్ షెడ్లను శనివారం వారు పరిశీలించారు. ఈ విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, నిధులు మంజూరు చేయించి నిర్మాణ పనులను పూర్తి చేయిస్తామన్నారు. నాయకులు చెన్ని బాబు, రాంరెడ్డి, లింగంగౌడ్, గౌస్, తిరుపతిరెడ్డి, దండు శ్రీనివాస్, బండారి బాల్‌రెడ్డి, నవాబ్, సత్తయ్య తదితరులున్నారు.

బోర్డుపై పేర్ల తొలగింపు

చందుర్తి: చందుర్తి మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలోని బోర్డు ఉన్న పేర్లను ఎమ్మార్సీ కార్యాలయం సిబ్బంది శనివారం తొలగించారు. ఈనెల 17న అధికారులు మారినా ..అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బోర్డుపై వేసి కలర్ వేసి పేర్లు రాయించేందుకు సిద్ధమయ్యారు.

క్షీరాభిషేకం



బోయినపల్లి: మండలంలోని 23 గ్రామాలకు ఉపాధిహామీ పథకం కింద రూ.1.15 కోట్లు నిధులు మంజూరుకావడంపై హర్షం వ్యక్తంచేస్తూ మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం ప్రధానిమోడీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఎడపల్లి పరశురామ్, మాజీ అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి, ఉదారి నర్సింహాచారి, కిరణ్,గంగాధర్, అశోక్, గంగాధర్‌చారి, తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కేకే మహేందర్‌రెడ్డి

గంభీరావుపేట: ముస్తాబాద్ మండలానికి ఉపాధిహామీ పథకం కింద రూ. 4కోట్లతో మంజూరు కాగా అభివృద్ధి పనులకు కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కేకే మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ కార్యకర్తలు సిరిసిల్లలో ఎంత దోచుకున్నారో బయటపెడుతానన్నారు. నియోజకవర్గంలో ఉన్న ప్రభుత్వ భూములను అక్రమంగా దాదాపు 2వేల ఎకరాలను అనర్హులు, కార్యకర్తలకు ముట్టజెప్పడం నిజం కాదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎల్ల బాల్‌రెడ్డి, నాయకులు చక్రధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్రీధర్, తదితరులు

బోయినపల్లి: సంగారెడ్డిలో ఈనెల 25 నుంచి 28వరకు జరిగే సీపీఎం 4వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం మండల కన్వీనర్ గుర జాల శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం మండలకేంద్రంలో సీపీఎం రాష్ట్ర మహాసభల జయప్రదం కోసం రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్మికులు రాష్ట్ర మహాసభల్లో పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో రాజనర్సు, కడుదుల రవి, గూడ లచ్చిరెడ్డి, అల్వాల అంజయ్య, నాంపల్లి,భూమయ్య తదితరులున్నారు.